# అమ్మన్న అమ్మిన —
# అయిదోతనం

## కథ: 'చంద్రకాంత'

★

అమ్మన్న అయిదో సంవత్సరం వెళ్ళిననాటినుండి అయిదు, పది సంవత్సరాలూ నిండేనాటికి పెళ్ళి ప్రయత్నాలు పూర్తిఅయ్యాయి.

పెళ్ళికావడమే తరవాయి...రెండు మూడు రోజులు ఆగితే ఆ 'అడ్డు' కూడా తీరిపోతుంది. ఆ యింటి 'బరువు' తీరిన తల్లిదండ్రులు మాత్రం మిగులుతారు.

★

ఒక బండెడు బంధువులు దిగేరు. చీకటిపడే వేళకు ఇదే సరుకుతో ఆ యిల్లు నిండుతుంది. అమ్మన్నకు జ్వరం వచ్చినట్టుంది. అది చూసిన వారంతా ఇంకోవిధంగా అన్నారు. 'ఆమె లక్ష్మీకళతో కళకళలాడుతోంది' 'అది కళ్యాణ కళ...జీవితంలో పరమోచ్చ స్థితి.'

కాని, ఆ సాయంత్రానికే, ఆమె తల్లి, ఆ ఇల్లు వదలి, ఈ భూమి వదలి, ఒక పెద్ద ఆవేశంతో — అనుకోని దూరదూరాలకు యానమైపోయింది!

పెళ్ళికని వచ్చిన బంధువులు—పెళ్ళికూతురు తండ్రిని పరామర్శచేసి, పెళ్ళిసంభారాలన్నీ సవ్యంగా ఖర్చుచేసి, తరలి వెళ్ళిపోయారు.

★

మరి మూడు సంవత్సరాలవరకూ అమ్మన్నకు వరుడు కావాలే అనే దిగులుపడేవారు లేకపోయారు. కాని, దిగులు ఎలాగో తండ్రిలో ప్రవేశించసాగింది—

'ఈ వొక్క శుభకార్యం నెరవేరిస్తే నీ నెత్తి బరువు తీరుతుంది' అని జ్ఞప్తికి తెచ్చారు కొందరు.

ఆమాట నిజమే అన్నాడు. ఆడపిల్లలను కనిన తండ్రులు అన్నేళ్ళు ఏదో విధాన ఈ ఆడ సరుకును విలువచూపి, చలామణీచేసి, వినిమయం చేస్తారు. తనూ ఏదోవిధాన ఈ వక్క వస్తువునూ వదల్చుకుంటే—మిగిలిన తన బ్రతుకు, తనకు మిగిలిన ఇంటిచూరులో నెట్టుకుపోగలడు.

★

మళ్లీ పెళ్ళివారు వచ్చేరు. మళ్ళీ అమ్మన్న పెళ్ళికూతురయింది. ఈమాటు గౌరీపూజకూడా పూర్తిచేసుకుంది. అంగుళీయార్పణకు ఆడపెళ్ళివారి ఆడమొగలంతా విడిదికు వెళ్ళేరు. ఇంట్లో వంట హడావుడిలో వారూ, ఇద్దరు ముగ్గురు పిల్లలూ, ఎవరో ముసలివారూ తప్ప లేరు.

పెళ్ళికూతురు అమ్మన్న అలసిపోయింది. ఏదో పెద్ద జ్వరం తగిలినట్టుగా వుందామెకు. మేడమీద తన గదిలోకి వెళ్ళి, వంటరిగా కూర్చుంది.

ఆదే సమయం—

ఆదే క్షణం—

ఆమె జీవితంలో అత్యున్నతమయినది. మానసిక భౌతిక శరీరాలకు చక్రవాళ సౌందర్యాన్ని ప్రసాదించేది!

మూడున్నర సంవత్సరాలక్రితం మూసుకున్న కళ్లు తెరవకుండా అమ్మ, ఎదురుగోడమీద నిలచి వుంది. ఆ మైకపు కళ్లకు ఇక స్పృహరాదు.

★

"ఆ గదిలో వున్నమ్మాయే పెళ్ళికూతురు—"

ఇవి ఎవరో గదిబయట అన్న మాటలు.

మరొక్క క్షణంలో ఆ గదిలోకి ఒక ఆమె వచ్చింది.

అమ్మన్న లేచి నిలుచుంది...ఆమె ఇరవై

యేళ్లది. అందమైనదే—కాని, ఆమెలో ఏదో అందవికారం మాత్రం వుంది. ఆమె చేతిలో ఏదో వార్తాపత్రికతో చుట్టి, ఒక పొట్లం వుంది. ఆమె వస్తూ తన వెనకాలే తలుపు మూసివేసింది.

"మీరు నన్ను యెరగరు."

"ఫరవాలే—కూర్చోండి—"

"కూచుంటే యెలా? వీధిలో బండి నిలబెట్టి వచ్చా."

"బండీని పంపెయ్యొచ్చు. అరగంటలో అంతా వస్తారు—"

"—వాళ్లుమాత్రం యెరుగుదురా?"

"అయినా ఫరవాలేదు. ఈ క్షణంనుంచి నన్నెరుగుదురు. కూర్చోండి."

"నే కూచోడానికి రాలా... కూచుంటే యెలా—?" అంటూ ఆమె కూర్చుంది. ఆమెలో ఏదో నాజూకుతనం వున్నట్లు అమ్మన్న అనుకుంటోంది. ఆమె చటుక్కున లేచి నిలుచుంది. ఆమె ముఖం తెలుపు—పసిమి—మధ్యరంగు.

"నే పనిమీద వచ్చేను. కాలయాపన చెయ్యడానికి వీల్లేదు. వారంతా వచ్చేలోగానే వెళ్ళిపోవాలి."

అమ్మన్న కళ్లతో వింటోంది. ఏదో ఆలోచిస్తోంది. ఆ వ్యక్తి తనకు పరిచయురాలే—బాగా పరిచయురాలేనేమో! ఎక్కడ? ఏమో—ఎవరో!

"సరే, నాతో ఏం పని? అయితే త్వరగా పూర్తిచేసుకుని వెళ్లండి."

★

"మీరు పెళ్ళికొడుకుని చూశారా? అవును చూడలేదు. పెళ్లయితేనే చాలునని మీ నాన్నగారూ...సరే—పెళ్లే కాబట్టి కానియ్యమని మీరు—"

ఆమె మాటలు అమ్మన్న వింటోంది. తన హృదయంలోంచి వస్తున్న ధ్వని—అది...ఏమో! "ఏమీ ఆశ్చర్యంలేదు. ఎవరో ముక్కూ మొగమూ ఎరగని మీలాటివారికంటే మా నాన్నగారు నా సుఖంకోసం తక్కువ ఆలోచిస్తారా?"

"అవును. ఆయన సంబంధం బాగుందన్నారు. మీకూ నచ్చింది. సంబంధం అన్నివిధాలా బాగుంది...కాని,—"

"కాని—?"




నేతాజీ ఆమ్లా హేరాయిల్

సువాసనతోకూడిన వనమూలికలతో తయారుకాబడినది

★

తలవెంట్రుకలను పెంచును. కుదుళ్ళకు బలమునిచ్చి నల్లగ నిగనిగలాడు నిడుపాటి వెంట్రుకల నిచ్చుటలో సాటిలేనిది. తల వెంట్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకుట మొదలగువానిని నివారించును. అన్నివేళలకు ఆనందమునిచ్చి శీతల పరిమళము కలిగియుండును. వాడిన ఎడల గుణమును గుర్తించగలరు.

సీసా 1 కి రూ. 1-8-0. పోస్టేజి ప్రత్యేకం.

శ్రీ కృష్ణా సోప్ వర్క్సు, శివాలయం వీధి, బెజవాడ.

"ఈ సంబంధం జరగడానికి వీలులేదు. ఈ పెళ్ళి జరగడానికి వీలులేదు..."

అమ్మన్న ఆమె కళ్ళల్లోకి చూసింది. ఆమె కళ్లు దించివేసింది. గాజులు సవరించుకుంటోంది. ఆ చేతులు కొంచెం వణుకుతున్నాయి కాబోలు.

అమ్మన్న చిరునవ్వు విసిరింది. "మీరు కొంచెం తొందరపడవలసింది. అంతా మించిపోయిన తర్వాత రంగప్రవేశం చేశారు. ఒక్క రెండు రోజుల ముందు—కనీసం మూడుగంటలముందు మీరు పూనుకుంటే—మీ కోరిక నెరవేరేది. ఇటువంటి విషయాల్లో—మీ జీవితానికి—మీ ప్రణయానికి సంబంధించిన విషయాల్లో—ఇలా ఆలస్యం చెయ్యొచ్చా?"

"మిగిలిపోలేదు—పీటలమీదైనా పెళ్ళి చెడిపోవలసిందే—"ఇటూ అటూ పచారు చేస్తోంది—ఆ వింత ఆమె.

"ఒక్కటే పద్ధతి మిగిలుంది" అమ్మన్న ఆమెని అనుసరిస్తూ అంది; "పెళ్ళికూతుర్ని తారుమారు చేస్తే సరి. ఏదో సినిమాలో మాదిరి! అందుకు కావాలంటే నే నంగీకరిస్తా—సహాయం చేస్తా—ఏర్పాటు చేస్తా—ఏమయినా సరే! మీరు సిద్ధంగా వుండండి."

ఆ వ్యక్తి నిలబడిపోయింది. "అంటే—?"

"మరేమీ లేదు-అమ్మన్న బదులు మీరు—"

"క్షమించాలి...వాణ్ని పెళ్ళిచేసుకోవాలని నే నేమీ బాధపడడంలేదు."

"మరి—?"

"నువ్వతన్ని పెళ్లాడడానికి వీల్లేదు. వేరే కారణం—"

"వుండొచ్చు. నే నడగను. కాలం మితిమీరిందని మాత్రం నే నంటున్నాను. నాకు ఇదివరకు ఓ సారి తప్పిపోయింది పెళ్ళి. ఇప్పుడూ తప్పిపోయిందనుకు నేదాన్ని—"

"ఆ పెళ్ళికొడుకు ఇంకో రెండురోజులు దాటిం తర్వాత బతక్కపోతే—?"

ఇద్దరికీ ఒక్కసారి చిరునవ్వు పరుగెత్తింది.

"అందరూ ఏం చేస్తారో అదే నేనూ చేస్తాను. వితంతువునవుతాను."

"—అది కాదు—"

"పునర్వివాహమా? తనదాకా వస్తేగాని ఆలోచించే విషయం కాదది—"

★

క్రొత్తమనిషి ఒకసారి కూర్చుంది. మళ్లీ లేచి నిలబడింది. ఆమె ముఖ తీవ్రత తగ్గిపోతోంది. కాని, ముఖం పాలిపోతోంది.

"నే నింక వెడతాను. పెళ్ళివారు వస్తున్నారు."

"వెడుదురుగాని, కూర్చోండి."

"నే కూచోడానికి రాలా...కూచుంటే యెలా—?" అంటూ ఆమె కూర్చుంది.

"మరి మీరు వచ్చిన పని—?"

"అదే—!"

"కానియ్యండి."

"పెళ్ళి మానెయ్యి."

"జరుగుతుంది. వేళ మించిపోయింది."

"అయితే నీ అయిదోతనా న్నమ్మెయ్యి—"

"నా చేతిలో లేనిది—"

"లేకపోయినా—అనుభవించేది నువ్వు. అమ్మకం జరక్కా తప్పదు—అనుభవించకా తప్పదు."

"ఎలా నమ్మగలను—?"

"చెప్పు—"

"సరే—అమ్ముతాను—"

"ఇదిగో—ఖరీదు—" పత్రిక పొట్లం అందించింది.

"పది వేలరూపాయలు...ఎవరో వస్తున్నారు...వెడుతున్నాను..." అని వెళ్ళిపోయింది. ఒక్క క్షణంలో మళ్లీ గుమ్మందగ్గిరికి వచ్చి—"డబ్బు జాగ్రత్త" అని మాయమయ్యింది.

పొట్లం విప్పింది. నూరురూపాయల నూరు నోట్లకట్ట. పెట్టి తీసి అందులో పెట్టి, తాళం వేసింది.

అందరూ వస్తున్నారు. వచ్చేశారు. కంగారుతో లేచి నిలుచుంది.

★

యథావిధిగా పెళ్ళి అవుతోంది. అమ్మన్న మనస్సులో ఆ మనిషి మెదులుతోంది. పెళ్ళి అయిపోయింది. రెండురోజులు దాటిపోయింది. మూడోరోజురాత్రి కార్యం.

కాని, పెళ్ళికొడుకు ఆ రోజు మంచంమీద నుంచి లేవలేదు. సాయంత్రానికి నలుగురైదుగురు డాక్టర్లు వచ్చేరు. రాత్రికి ఇల్లంతా గొల్లుమన్నారు.

అమ్మన్న నేల కూలింది...మళ్ళీ లేచింది. తన గదిలోకి పోయి తలుపు బిగించుకుంది.

ఆమెకు ఏదో తెలివి వచ్చింది—పెట్టి తెరచి చూసింది.

అందులో నోట్లకట్ట లేదు.